పెండింగ్ పనులకు నిధులు మంజూరు చేయాలి



జెడ్‌సీకి వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న వివిధ అభివృద్ధి పనులకు నిధులు మంజూరయ్యేలా చూడాలని కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి కోరారు. దాదాపు 250.05 లక్షల రూపాయల విలువగల సీసీ రోడ్డు పనులను, డివిజన్ పరిధిలోని పెండింగ్‌లో ఉన్న రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు అయ్యేలా చూడాలని జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ వెంకన్నకు వినతిపత్రం సమర్పించారు. సానుకూలంగా స్పందించిన కమిషనర్ త్వరగా పనులు మంజూరయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారన్నారు.

శ్రీదేవి కళాశాలకు ఎన్‌బీఏ గుర్తింపు

మణికొండ: శ్రీదేవి మహిళా ఇంజనీరింగ్ కళాశాలకు మరో మారు నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు దక్కింది. నార్సింగి మున్సిపాలిటీ, వట్టినాగులపల్లిలోని కళాశాలకు మూడవ సారి ఎన్‌బీఏ గుర్తింపు దక్కటంతో బుధవారం సంబరాలు చేసుకున్నారు. మూడవ సారి అక్రిడేషన్ సాధించటంతో 2025–26వ విద్యా సంవత్సరం నుంచి 2027–28 వరకు అది చెల్లుబాటు అవుతుందని, దాన్ని సాధించేందుకు కృషి చేసిన కళాశాల సలహాదారుడు టి.రవీందర్‌రెడ్డికి యాజమాన్యం అభినందనలు తెలిపింది. కళాశాలలో విద్యామండలి నియమ, నిబంధనలను పాటించటంతోనే అది సాధ్యమైందని, రాబోయే రోజుల్లోనూ విద్యార్థిల అభ్యున్నతికి మరింతగా కృషి చేస్తామని యాజమాన్యం తెలిపింది. విద్యార్థినులకు నాణ్యమైన విద్యతో పాటు పరిశోధనలలో రాణించేందుకు మరింత కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో స్వీట్లు పంచుకుని సంబరాలు చేసుకున్నారు.

'సండే ఈవెనింగ్ టాక్' కార్యక్రమం

రాయదుర్గం: బ్రహ్మకుమారీస్ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని శాంతిసరోవర్ క్యాంపస్‌లో ఆదివారం 'సండే ఈవెనింగ్ టాక్' కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. సాయంత్రం 6.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. ఈ సదర్భంగా కేర్ ఆస్పత్రి ఇంటర్‌వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ఆశుతోష్‌కుమార్ 'యువర్ గైడ్ టు ఏ హెల్దియర్ హార్ట్' అంశంపై ప్రత్యేక ఉపన్యాసం చేస్తారు.

ప్రయాణం.. ప్రమాదకరం!

- రోడ్డుపైకి వచ్చిన ముళ్ల పొదలు
- వర్షాలకు గుంతలమయమైన రోడ్డు


సుల్తాన్‌పల్లి శివారులో ఎంటేరువాగు వద్ద ధ్వంసమైన సీసీ రోడ్డు

శంషాబాద్ రూరల్: వాహనదారుల పాలిట ఆ రహదారి ప్రాణాంతకంగా తయారవుతోంది. నిర్వహణలో రాజ్యమేలుతున్న నిర్లక్ష్యం వారికి శాపంగా మారింది. భారీ వర్షాలకు ధ్వంసమైన రోడ్లపై వాహనదారులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని రాకపోకలు సాగించాలంటే పరిస్థితి ఎంత దుర్భరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

- శంషాబాద్–మొయినాబాద్ మండలాలను అనుసంధానం చేసే రోడ్డులో కేబీ దొడ్డి శివారులో చెట్ల పొదలు ఓ వైపు దారిని కమ్మేశాయి. మూల మలుపులో ఉన్న ఈ ముళ్ల పొదలతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక.. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈసీ వాగు సమీపంలో రోడ్డుకు ఓ వైపు పూర్తిగా ముళ్ల పొదలు ఏపుగా పెరిగాయి. రోడ్డు, భవనాల శాఖ అధికారులు రోడ్డు నిర్వహణపై దృష్టి సారించకపోవడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడంలేదు.

వర్షాలకు ధ్వంసమైన రోడ్డు...

సుల్తాన్‌పల్లి–కేబీ దొడ్డి మార్గంలో వరద దాటికి రోడ్డు ధ్వంసమైంది. ఇటీవల కురిసిన వానలతో ఎంటేరువాగు వద్ద భారీగా వరద పారింది. దీంతో రోడ్డుకు ఓ వైపు మట్టి కొట్టుకుపోయింది. సీసీ రోడ్డు పక్కన భారీ గుంతలు పడ్డాయి. రాత్రి వేళల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అసంపూర్తిగా రహదారి పనులు..

కేబీ దొడ్డి నుంచి రాయన్నగూడ చౌరస్తా మార్గంలో రహదారి విస్తరణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. సుమారు 800 మీటర్ల దూరం పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఈ మార్గంలో అడుగడుగునా గుంతలు పడ్డాయి. వర్షాలతో రోడ్డు అధ్వానంగా మారింది. నిత్యం వందల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గంలో ప్రయాణం నరకంగా మారిందని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు.


కేబీ దొడ్డి వద్ద రహదారిపై ముళ్ల పొదలు

రోడ్ల మధ్యలో మ్యాన్‌హోల్స్

అత్తాపూర్: పలు ప్రాంతాల్లోని రోడ్ల మధ్యలో ఉన్న మ్యాన్‌హోల్స్ వాహనాదారులు, పాదచారులకు ప్రమాదకరంగా తయారవుతున్నాయి. వివరాలివీ... అత్తాపూర్–బాపు ఘాట్ బ్రిడ్జి వైపు వెళ్లే రహదారిపై హనుమాన్ ఆలయ సమీపంలో ప్రధాన రహదారిపై మ్యాన్‌హోల్ మూత పగిలిపోవడంతో తరచు ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాదారులు, పాదచారులు అందులో పడి గాయాల బారినపడుతున్న సంఘటనలు అనేకం ఉన్నాయి. ఈ విషయమై అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసిన ఏ ఒక్కరూ స్పందించడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకొని ప్రమాదకరంగా మారిన మ్యాన్‌హోల్స్‌కు మరమ్మతులు నిర్వహించి మూతలను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.


అత్తాపూర్–బాపు ఘాట్ బ్రిడ్జి వైపు వెళ్లే రహదారిపై మూత లేని మ్యాన్‌హోల్

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు వినతి

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ లక్ష్మీగూడ హౌసింగ్ బోర్డు కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు అడికే రాజు ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌ను బుధవారం కలిసి సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రాన్ని అందజేశారు. కాలనీలో ఉన్న పార్కులు, కమ్యూనిటీ హాల్స్, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. ఆయన సానుకూలంగా స్పందించి తప్పకుండా త్వరలోనే సమస్యలన్నింటికీ పరిష్కరిస్తామని ప్రజలంతా సహకరించాలని కోరారు. హౌసింగ్ బోర్డు పూర్తి బాధ్యతను జీహెచ్‌ఎంసీకి ఇచ్చింది కావున జీహెచ్‌ఎంసీ అధికారులు కాలనీలో సమస్యలను గుర్తించి కనీస వసతులు కల్పించాలని కాలనీ అధ్యక్షుడు అడికే రాజు కోరారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున రాజు

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి


డ్రైనేజీ క్లీనింగ్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: పరిసరాలను శుభ్రంగా ఉంచుకున్నప్పుడే ప్రజలు ఆరోగ్యవంతంగా ఉంటారని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర సూచించారు. బుధవారం కార్పొరేషన్ పరిధిలోని 1వ డివిజన్‌లోని తిరుమల హిల్స్ కాలనీలో తడి, పొడి, హానికారక చెత్తపై కాలనీ ప్రజలకు అవగాహన కల్పించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ క్లీనింగ్ ప్రక్రియను పరిశీలించి అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. డిప్యూటీ ఈఈ జి.యాదయ్య, ఏఈఈ వి.రాజ్‌కుమార్, జి.వెంకట్‌రెడ్డి, వార్డు ఆఫీసర్ గణేష్, బిల్ కలెక్టర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌పీలు, శానిటరీ జవాన్లు పాల్గొన్నారు.

మైలార్‌దేవ్‌పల్లిని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నాం

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ను గ్రేటర్‌లోనే ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బాబుల్‌రెడ్డినగర్ అభివృద్ధి పనుల్లో భాగంగా నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు పనులను జీహెచ్‌ఎంసీ, జలమండలి అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డివిజన్ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులలో ఎక్కడా ఎలాంటి నాణ్యత లోపాలు లేకుండా నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ సకాలంలో నిర్ణీత సమయంలో అభివృద్ధి పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకోని రావాలని అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకోని ప్రజా సమస్యల శాశ్వత పరిష్కారానికి అహర్నిశలు కృషి చేయడం జరుగుతుందన్నారు. ప్రజలకు సమస్యలు తలెత్తకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ను గ్రేటర్ హైదరాబాద్‌లోని అన్ని రంగాలలో ఆదర్శవంతమైన డివిజన్‌గా తీర్చిదిద్దడానికి అహర్నిశలు కృషి చేయడం జరుగుతుందన్నారు. ఇంకా డివిజన్ పరిధిలో ఏమైనా సమస్యలు ఉంటే బస్తీవాసులు తన దృష్టికి తీసుకువస్తే అధికారులతో మాట్లాడి ప్రజా సమస్యలను పరిష్కరించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని బస్తీ వాసులకు హామీ ఇచ్చారు. డివిజన్ ప్రెసిడెంట్ పాండుయాదవ్, నేతలు రావుల భాస్కర్, నోముల పవన్‌యాదవ్, శంకర్‌గౌడ్, రవీందర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, బబ్లూ, శశిధర్‌రెడ్డి, ఏన్ను శ్రీనివాస్‌రెడ్డి, చెన్నారెడ్డి, నవారు మురళీధర్‌రెడ్డి, మజర్‌భాయ్, అనిల్‌ముదిరాజ్, నిశాంత్, రాజిరెడ్డి, శశిధర్‌రెడ్డి, శంకర్, నర్సింహ్మా, జీహెచ్‌ఎంసీ ఏఈ నర్సింహమూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, జలమండలి సూపర్‌వైజర్ లోక్‌నాథ్, వాటర్ వర్క్ రఘునాయక్, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.


బాబుల్‌రెడ్డినగర్‌లో అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్న కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి

పాఠశాలకు 'పూర్వ' విద్యార్థుల వితరణ


పాఠశాలలో బోరు వేయిస్తున్న పూర్వ విద్యార్థులు


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థులు తమ సొంత ఖర్చులతో బోరు వేయించారు. పాఠశాలలోని బోరు పాడైందని, విద్యార్థులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రధానోపాధ్యాయురాలు డాక్టర్ ఎం.సుగుణ బీజేపీ నాయకుడు, పూర్వ విద్యార్థి అయిన వై.శ్రీధర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన 1982–83వ బ్యాచ్ విద్యార్థులైన వై.చిన్మయానంద స్వామి, ఎం.కృష్ణారావుల దృష్టికి సమస్యను తీసుకొచ్చారు. వారు తమ క్లాస్‌మేట్లందరికీ సమస్యను వివరించి పాఠశాలలో తమ సొంత ఖర్చులతో బోరు వేయడానికి ముందుకు వచ్చారు. తమకు విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయులు అనంతరెడ్డి, జంగయ్య మాస్టార్లను పిలిచి వారితో బోరు వేసే ముందు పూజలు చేయించారు. బుధవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగిన ప్రేయర్‌లో హెచ్‌ఎం డాక్టర్ ఎం.సుగుణతో కలిసి విశ్రాంత ఉపాధ్యాయులు అనంతరెడ్డి, జంగయ్య, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు అనంతరెడ్డి, జంగయ్య ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ సుగుణలను సన్మానించారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు ఎం.కృష్ణారావుని సన్మానించారు.

హాకీ క్రీడ అభివృద్ధికి చర్యలు

గచ్చిబౌలి: స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ శివ సేనా రెడ్డిని హాకీ అధ్యక్షుడు కొండా విజయ్ జిల్లా కమిటీ సభ్యులతో కలిసి అభినందనలు తెలిపారు. హాకీ అకాడమిని రంగారెడ్డి జిల్లాకు కేటాయించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. గచ్చిబౌలి స్టేడియంలోని కార్యాలయంలో బుధవారం ఆయన శివసేనా రెడ్డిని కలిసి హాకీ స్టిక్ అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా శివ సేనా రెడ్డి మాట్లాడుతూ హాకీ జిల్లా అకాడమిని గచ్చిబౌలి స్టేడియంలో ఏర్పాటు చేయడం ద్వారా హాకీ క్రీడ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తుందన్నారు. అకాడమిలో శిక్షణ తీసుకునేందుకు 24 మంది బాలికలు, 24 మంది బాలురను ఎంపిక చేసినట్లు తెలిపారు.

ఇష్టారాజ్యంగా వ్యర్థాల పారబోత

అత్తాపూర్: గృహ నిర్మాణాల వ్యర్థాలు నిరుపయోగంగా ఉన్న వస్తువులు, చెత్త చెదారాలను మూసీ పరీవాహక ప్రాంతంలో కుప్పలు తెప్పలుగా వేస్తున్నారు. దీంతో మూసీ నది తీర ప్రాంతమంతా వ్యర్థాలతో నిండిపోతూ అక్రమణలకు గురవుతుంది. అత్తాపూర్ పాత గ్రామ సరిహద్దు నుంచి మూసీ నది పరిసర ప్రాంతాల్లో నూతంగా నిర్మించుకునే గృహ నిర్మాణదారులు పురాతన ఇళ్ల వ్యర్థాలను డంప్ చేసిన ప్రాంతాలను అక్రమణదారులు చదును చేసి ఆయా ప్రాంతాలను ఆక్రమించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. గ్రామ సరిహద్దులను సూచిస్తు మూసీ నది పరీవాహక ప్రాంతాలలో సూచిక బోర్డులను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. పరీవాహక ప్రాంతాలు కబ్జాలకు గురి కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. సంబంధిత అధికారులు సరిహద్దుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నిఘాను పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

డిగ్రీ విద్యార్థులకు ఫస్టియర్ కీలకం

గోల్కొండ: డిగ్రీ కోర్సులో మొదటి సంవత్సరం ఎంతో కీలకమని గోల్కొండ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి అన్నారు. కళాశాలలో ఫస్టియర్ విద్యార్థినులకు బుధవారం ఓరియంటేషన్ పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇంటర్ నుంచి డిగ్రీలో చేరే విద్యార్థినులు మొదట్లో ఆందోళన చెందుతారని అలాంటి వారిలో ఆత్మీయ భరోసా కల్పించాల్సిన బాధ్యత సీనియర్లపై ఉంటుందన్నారు. అధ్యాపక బృందం సైతం ఫ్రెషర్స్‌కు కళాశాల నిబంధనలను వివరించాలని సూచించారు.

సర్వీస్ రోడ్డులో ఆక్రమణల పర్వం

చూసీచూడనట్లు వ్యవహరిస్తున్న అధికారులు

మైలార్‌దేవ్‌పల్లి: ప్రధాన రహదారులపై సర్వీస్ రోడ్డు ఆక్రమణకు గురువుతున్నాయి. సర్వీస్ రోడ్డు జాడ లేకుండా వాటిపై దుకాణాలు ఏర్పాటు చేసి వ్యాపారం చేస్తున్నారు. సంబంధిత అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలోని కిందిస్థాయి సిబ్బంది మామూళ్లతో సరిపెట్టుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

- మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని ఆరాంఘర్ నుంచి దుర్గానగర్ ప్రధాన రహదారిపై సర్వీస్ రోడ్డును ఏర్పాటు చేశారు. అయినా వ్యాపారస్తులు ఆ సర్వీస్ రోడ్డును ఆక్రమించి వ్యాపారాలు చేసుకుంటున్నారు. రోడ్డుకు ఇరువైపులా సర్వీస్ రోడ్డు జాడలేకుండా పోయింది. కొంత మేర సర్వీస్ రోడ్డు ఉన్నా పిచ్చిమొక్కలు పెరిగాయి. ఓ వ్యాపారి ఏకంగా సర్వీస్ రోడ్డును పూర్తిగా ఆక్రమించి మార్బుల్ వ్యాపారం చేస్తున్నారు. మరి కొందరు తాము చేసుకుంటున్న వ్యాపారాన్ని సర్వీస్ రోడ్డును ఆక్రమించి కార్పెంటర్ వర్క్స్ చేసుకుంటున్నారు. ఒకరు టిఫిన్ సెంటర్ ఏర్పాటు చేసుకుంటున్నారు. టిఫిన్ సెంటర్ వద్ద వాహదారులు ఏకంగా రోడ్డుపైనే వాహనాలను నిలపడం ద్వారా ఇతరులకు ఇబ్బందులకు గురవుతున్నారు.
- ఆరాంఘార్ నుంచి దుర్గానగర్ వెళ్లాలంటే రోడ్డుపై వాహన రద్దీ పెరిగిపోవడంతో వాహనదారులు నరకం చూస్తున్నారు. ఇలా నిత్యం ట్రాఫిక్ రద్దీతో వాహనాలు పరేషాన్ అవుతుంటే సర్వీస్ రోడ్డులు ఉన్న ఎలాంటి ప్రయోజనం ఉండటంలేదు. సర్వీస్ రోడ్డు ఆక్రమణతో ప్రధాన రహదారిపైనే లారీలను నిలుపుతున్నందున ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రెండు రోజుల క్రితం రోడ్డుపై నిలిచిన లారీని వెనుక నుంచి ఓ కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఇలా ప్రమాదాలు జరిగేందుకు ప్రధాన కారణం రహదారిపై ఉన్న సర్వీస్ రోడ్డును ఆక్రమించడమే అని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు ప్రధాన రహదారులపై లారీలను నిలపకుండా సర్వీస్ రోడ్డును అందుబాటులోకి తీసుకొస్తే కొంతమేర ప్రమాదాలు జరుగకుండా ఉంటాయని స్థానికులు పేర్కొంటున్నారు.

ఆరాంఘార్–దుర్గానగర్ సర్వీస్ రోడ్డును ఆక్రమించిన వ్యాపారులు



సర్వీస్ రోడ్డును ఆక్రమించిన మార్బుల్ షాపు

రోడ్డుపైనే వ్యాపారాలు



ఆరాంఘర్ నుంచి దుర్గానగర్ చౌరస్తా వరకు ఇరువైపులా సర్వీస్ రోడ్డు ఉండేది. ఇప్పుడు సర్వీస్ రోడ్డుపై వ్యాపారులు ఏకంగా దుకాణాలతో ఆక్రమించారు. ప్రధాన రహదారి కావడంతో వాహనాల రద్దీ పెరిగిపోయింది. రోడ్డుపై నడవాలన్నా ఇబ్బందులు తప్పడం లేదు. సర్వీస్ రోడ్డు ఉంటే వాహనదారులు, పాదచారులకు ఎలాంటి ఇబ్బంది ఉండదు.

– కోట పవన్, మార్కండేయనగర్

ఆక్రమణలను తొలగించాలి



సర్వీస్ రోడ్డులో కొందరు ఇష్టానుసారంగా ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించాలి. నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రజలు నడిచేందుకు వీలు లేనంతగా రద్దీ పెరిగింది. సర్వీస్ రోడ్డు లేక కొన్ని భారీ వాహనాలు రోడ్డుపైనే నిలుస్తున్నాయి. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు గుర్తించి సర్వీస్ రోడ్డులో ఉన్న ఆక్రమణలను తొలగించాలి.

– వై.భాస్కర్, వాహనదారుడు


సర్వీస్ రోడ్డులో టిఫిన్ సెంటర్, కార్పెంటర్ షాపు


పిచ్చిమొక్కలు పెరిగిన సర్వీస్ రోడ్డు

విద్యుత్ బిల్లులు వసూలు చేయాలి


రాఘవేంద్ర కాలనీలో పర్యటిస్తున్న సీజీఎం పాండ్య తదితరులు

గచ్చిబౌలి: మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న కమర్షియల్ సర్వీస్‌ల విద్యుత్ బిల్లులు వసూలు చేయని పక్షంలో ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని టీజీఎస్‌పీడీసీఎల్ జోనల్ చీఫ్ ఇంజనీర్ పాండ్య అధికారులను హెచ్చరించారు. బుధవారం సైబర్‌సిటీ సర్కిల్ కేటగిరి–2, కేటగిరి–2లో మొండి బకాయిల వసూళ్లపై ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. బిల్లులు చెల్లించని సర్వీస్‌లను తొలగించాలని అధికారులను ఆదేశించారు. ఇకపై అధికారులు అనుమతి లేకుండా లైన్‌క్లియర్‌లు తీసుకోవద్దని సూచించారు. విద్యుత్ సరఫరా అంతరాయాలకు కారణాలను గుర్తించి వారం రోజుల్లో పరిష్కరించాలన్నారు. అనంతరం బస్తీ బాటలో భాగంగా టీజీఎస్‌పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ పాండ్య, జనరల్ మేనేజర్ అంజయ్య రాఘవేంద్ర కాలనీలో అధికారులతో కలిసి పర్యటించారు. విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సైబర్‌సిటీ ఎస్‌ఈ చంద్రశేఖర్, కొండాపూర్ డీఈ శ్యామ్ కుమార్, ఏడీఈ కమలాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొదలతో విద్యుత్ సరఫరాకు అంతరాయం


బయోడ్ కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్ కనిపించకుండా ఉన్న చెట్లు


ట్రాన్స్‌ఫార్మర్, ఫీజులకు అల్లుకున్న తీగలు


విద్యుత్ వైర్లకు అల్లుకున్న తీగలు

మణికొండ: విద్యుత్ సరఫరాకు తరచూ అడ్డంకులు ఏర్పడుతున్నాయి. వర్షాకాలం ప్రారంభం కావటం, ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద గడ్డి, పిచ్చి మొక్కలతో పొదలు పరచుకుని ఉండటంతో అవి తాకి ఫ్యూజ్‌లు పోవటం, ట్రిప్ అవుతున్నాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతారాయం నెలకొంటోంది. సమస్య ఉత్పన్నం అయినప్పుడు సిబ్బంది ఆగమేఘాల మీద వర్షంలోనే వాటికి మరమ్మతులు చేసి సరఫరాను పునరుద్ధరిస్తున్నారు. కొన్ని చోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్దకు వెళ్లేందుకు అవకాశం లేకుండా పొదలు పెరిగాయని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటి కారణంగా మరమ్మతులు చేసేందుకు వీలు కలగటం లేదంటున్నారు. విద్యుత్ వైర్లకు అనుకునే కొమ్మలను తొలగిస్తున్నట్టుగానే ఓ సారి ట్రాన్స్‌ఫార్మర్‌ల వద్ద పెరిగిన చెట్లు, పొదలను తొలగించాలని వారు కోరుతున్నారు.